RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 119 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | సోమవారం | 02.11.2026 | పేజీలు : 8


చౌటుప్పల్‌లో జోగిని హత్య.. రూ.లక్షల సొత్తు దోపిడీ!

- మహానగర సమీపంలో అర్ధరాత్రి ఘోరం: జోగిని సుధాకర్ హతం
- తులాల కొద్దీ బంగారం, రూ.10 లక్షలతో చెక్కేసిన హంతకులు
- బాధితుడి కారులోనే పరార్: సరిహద్దుల్లో పోలీసుల నిఘా
- వేలిముద్రల సేకరణ: దర్యాప్తు ముమ్మరం చేసిన ప్రత్యేక బృందాలు


2

ఉప్పల్‌లో దొంగ వీరంగం 20 రోజుల్లో 10 చోరీలు

- శిక్ష అనుభవించి వచ్చినా మారని తీరు : జైలు నుంచి రాగానే మళ్లీ నేరాల బాట
- ఉప్పల్ జోన్‌లో కలకలం: వరుస దొంగతనాలపై పోలీసుల ఉక్కుపాదం
- నిందితుడి వద్ద భారీగా సొత్తు రికవరీ: 37 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం



2

వాయుసేన ఉపాధ్యక్షుడిగా ఎయిర్ మార్షల్ వాలియా

- నవంబర్ 1 నుంచి విధుల నిర్వహణ: విభాగాధిపతిగా అధికారిక స్వీకరణ
- అమరుల ప్రాణత్యాగాలకు ప్రణామాలు: నివాళులర్పించిన వాలియా
- ఆకట్టుకున్న గౌరవ వందనం, సైనిక లాంఛనాలు
- సాంప్రదాయ పద్ధతిలో ఆహ్వానం


2

ఓటు బచావో.. దేశ్ బచావో

- ప్రధాని మోదీని దించేవరకు విశ్రమించం - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- రాజ్యాంగ బద్ధ హక్కులపై దెబ్బ: ఎన్నికల కమిషన్ అండతో బీజేపీ అక్రమాలు
- మొత్తం ఓట్లలో 20 శాతం కోతకు ప్లాన్: బీహార్, మహారాష్ట్ర తరహా కుట్రలు
- కార్యకర్తల ఉత్సాహాన్ని ఆపలేకపోయిన కేంద్రం: రేవంత్ ధ్వజం
- ఢిల్లీని ఊపేసిన ఇండియా కూటమి: విపక్ష నేతలతో కలిసి రేవంత్ రథయాత్ర

నిత్యం నిఘా, న్యూఢిల్లీ : భారత ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారిన బీజేపీ నిర్ణయాలపై తిరుగుబాటు బావుటా ఎగురవేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. దేశంలో దాదాపు 20 కోట్ల మంది ఓట్లను తొలగించి మళ్లీ అధికారంలోకి రాబట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ కుట్ర పన్నుతున్నారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ నాయకత్వంలో జరిగిన 'ఓటు బచావో.. దేశ్ బచావో' రామ్‌లీలా మైదాన్ బహిరంగ సభకు హాజరైన రేవంత్‌రెడ్డి, మొదట తెలంగాణ భవన్‌లో శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును హరించేందుకు కేంద్రం ఎన్నికల సంఘాన్ని సాధనంగా వాడుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సహాయంతో ఓటర్ల జాబితాల్లో అక్రమ మార్పులు చేస్తూ ఇప్పటికే 13.50 కోట్ల ఓట్లను తొలగించారని, మొత్తం ఓట్లలో 15 నుంచి 20 శాతాన్ని తొలగించేందుకు పథకం వేశారని రేవంత్ ఆరోపించారు. మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఓట్ల కోత విధానాలతోనే బిజెపీ లబ్ధి పొందిం దని, ఢిల్లీలోనూ అదే పునరావృతం చేయాలని చూస్తోందని మండి పడ్డారు.ఈ అన్యాయాన్ని నిలదీసేందుకు తెలంగాణ నుంచి...


2

కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు - కేటీఆర్ ధ్వజం!

- ఆదిలాబాద్ రైతు గర్జనలో గర్జించిన కేటీఆర్ : ఎకరానికి రూ.60 వేలు ఇవ్వాలని డిమాండ్
- హామీల అమలులో దారుణ వైఫల్యం : రైతులకు దక్కని రూ.15 వేల రైతుబంధు
- కర్ణాటక, ఏపీల్లో లేని వర్షపాత సమస్య తెలంగాణలోనే ఎందుకు?: నిలదీసిన కేటీఆర్
- 'రాహుల్ బంధు' నడుస్తోంది కానీ రైతుబంధు బకాయిలు లేవు
- రేవంత్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు


2

ఓటు హక్కు హరిస్తే ఊరుకోం..!

- మహా సంకల్పం ప్రజాస్వామ్య పరిరక్షణే : ఢిల్లీ వేదికగా కేంద్రంపై దాడి
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు డిమాండ్
- వ్యవస్థలన్నీ కొందరి కరతలామలకం : ఆర్ఎస్ఎస్ ఆధిపత్యంపై రాహుల్ ధ్వజం
- గాంధీజీ మార్గంలోనే ఉద్యమం : సోదర భావంతోనే ద్వేషంపై విజయం



2

గువహటిలో అత్యాధునిక క్యాన్సర్ ఆసుపత్రి!

- సామాన్యుడికి అందుబాటులోకి ప్రోటాన్ థెరపీ

- ప్రభుత్వ రంగంలో విప్లవాత్మక మార్పు - బెల్జియం సంస్థతో రూ.600 కోట్ల డీల్
- మూడేళ్ల వ్యవధిలో నిర్మాణ పూర్తి - ఈశాన్య రాష్ట్రాలకు చేరనున్న ఫలాలు
- కచ్చితత్వంతో క్యాన్సర్ చికిత్స - పక్క కణజాలానికి లేని నష్టం
- ప్రపంచ బ్యాంకు ఆర్థిక అండ - గువహటి వైద్య కళాశాలలో ఏర్పాట్లు


2

లింగ వివక్షకు బలైపోయిన గర్భిణి

- అబార్షన్ చేయించిన 24 గంటల్లోనే మృతి!

- అడబిడ్డ పుడుతుందనే కక్షతో పైశాచికత్వం: ధన్‌బాద్‌లో దిగ్భ్రాంతికర ఘటన
- కుటుంబ సభ్యుల ఒత్తిడితో తలవంచిన కిరణ్ కుమారి : అబార్షన్‌తో విషాదం
- వైద్యుల నిర్లక్ష్యం, కుటుంబ వేధింపులే కారణం: తండ్రి ఆవేదన


2

తాగునీటికి ఇక పటిష్ట రక్షణ - అందుబాటులోకి భాగ్యనగర 'గ్రీన్ వాటర్' సేవలు!

- నీటి ఆదాలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం
- నగరవ్యాప్తంగా దశలవారీ విస్తరణ
- అక్రమాలకు కట్టడి - జీపీఎస్, ముందస్తు రిజిస్ట్రేషన్
- ఎల్‌నినో భయాలు.. సుస్థిర జల యాజమాన్యం



నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో మంచినీటి బొట్టును ఆదా చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం, జలమండలి మరో విప్లవాత్మక అడుగు వేశాయి. సచివాలయంలో ఆదివారం జరిగిన జలమండలి 37వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా 'గ్రీన్ వాటర్ ట్యాంకర్ల' సేవలు అధికారికంగా షురూ అయ్యాయి. తాగునీరు మినహా ఇతర పనులకు శుద్ధి చేసిన మురుగునీటినే వాడాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నూతన కార్యక్రమాన్ని పట్టాలెక్కించారు. భవన నిర్మాణాలు, పార్కులు, ఉద్యాన వనాలు, రోడ్ల నిర్వహణ వంటి అవసరాలకు ఈ శుద్ధి చేసిన నీటిని అందుబాటులో ఉంచనున్నారు. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వివరాలు వెల్లడిస్తూ.. భాగ్యనగరం వేగంగా విస్తరిస్తుండటంతో రోజురోజుకూ మంచినీటి కొరత పెరుగుతోందని, అందుకే శుద్ధి చేసిన నీటిని ప్రత్యామ్నాయ అవసరాలకు ఉపయోగించడం తక్షణ అవసరమని తెలిపారు. వేసవి ఎండలలో భూగర్భ జలాలు త్వరితగతిన అడుగంటిపోకుండా చూసేందుకు ఈ గ్రీన్ వాటర్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ముమ్మందు ప్రభుత్వ శాఖలు, ...

2

ఓటు బచావో.. దేశ్ బచావో

- ప్రధాని మోదీని దించేవరకు విశ్రమించం - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. 15 వేల మంది కార్యకర్తలు రాకుండా రైళ్లను రద్దు చేసినప్పటికీ, కాంగ్రెస్ శ్రేణులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఢిల్లీకి తరలివచ్చాయని కొనియాడారు.హోంమంత్రి అమిత్ షా, ప్రధాని మోదీ కుట్రలను కాంగ్రెస్ సైన్యం తిప్పికొట్టిందని, మోదీని అధికార పీఠం నుంచి దించేవరకు ఈ సుదీర్ఘ పోరాటం ఆగదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇండియా కూటమి సందేశాన్ని ప్రతీ గ్రామానికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం వద్ద సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలతో పాటు మమతా బెనర్జీ, తేజస్వీ యాదవ్, అఖిలేశ్ యాదవ్, ఫరూక్ అబ్దుల్లా తదితర విపక్ష నాయకులతో కలిసి ఒకే బహిరంగ వాహనంలో రామ్‌లీలా మైదానానికి ర్యాలీగా బయలుదేరారు.

ఉప్పల్‌లో దొంగ వీరంగం 20 రోజుల్లో 10 చోరీలు

మొదటిపేజీ తరువాయి.. నేర ప్రవృత్తిని మార్చుకోలేక జైలు నుంచి బయటికి వచ్చిన వెంటనే మరోసారి దొంగతనాలు మొదలుపెట్టాడో నిందితుడు. ఉప్పల్ పోలీసు జోన్ పరిధిలో కేవలం ఇరవై రోజుల వ్యవధిలో పది చోరీలకు పాల్పడిన నవీన్‌ను పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. జైలు శిక్ష ముగిసి బయటకు వచ్చిన నవీన్ కొద్దిరోజులకే తన పాత నైజాన్ని ప్రదర్శిస్తూ ఉప్పల్ ప్రాంతంలో వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు.వివిధ ప్రాంతాల్లో వరుసగా ఇళ్ల తాళాలు పగలగొడుతుండటంతో అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సంఘటనా స్థలాల వద్ద లభించిన ఆధారాలు, నిందితుడి కదలికల ఆధారంగా నిఘా పెట్టి నవీన్‌ను అరెస్ట్ చేశారు. జైలు నుంచి విడుదలైన నాటి నుంచే అతను ఈ నేరాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.నిందితుడి నుంచి దాదాపు 37 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. ఈ చోరీ సొత్తును ఏయే కేసులకు సంబంధించిందో సరిపోల్చుతున్న అధికారులు, త్వరలోనే బాధితులకు ఆభరణాలు అప్పగించనున్నారు. జైలు నుంచి రాగానే ఇంత తక్కువ సమయంలో పది చోరీలు చేయడం స్థానికంగా సంచలనం సృష్టించింది. నవీన్‌ను మరింత విచారించి, ఈ వరుస దొంగతనాల వెనుక ఇంకా ఎవరైనా సహకరించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వాయుసేన ఉపాధ్యక్షుడిగా ఎయిర్ మార్షల్ వాలియా

మొదటిపేజీ తరువాయి.. భారత వైమానిక దళం (IAF) ఉపాధ్యక్షుడిగా (వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్) ఎయిర్ మార్షల్ ఇంద్రపాల్ సింగ్ వాలియా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. మిలిటరీలో విశిష్ట సేవలు అందించినందుకు గాను అతి విశిష్ట సేవా పతకం, విశిష్ట సేవా పతకాలు అందుకున్న వాలియా.. వైమానిక దళంలో అత్యంత ప్రాధాన్యమున్న పదవిని అధిరోహించారు.తన కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తూ, ఆయన ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ వద్ద అమర వీరులకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ సార్వభౌమాధికారం కోసం సైనికులు చేసిన త్యాగాలు అమరమైనవని పేర్కొన్నారు. అనంతరం సైనిక లాంఛనాల నడుమ ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. దళాల ఉన్నతాధికారుల మార్పిడి వేడుకల్లో భాగంగా ఈ సాంప్రదాయ కవాతు నిర్వహించారు.సరిహద్దు భద్రతతో పాటు విపత్తుల సమయంలో వాయుసేన అందిస్తున్న సేవలు అత్యంత కీలకమైనవి. ప్రస్తుత ఆధునిక భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా దళాల శిక్షణను, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో వాలియా కీలక పాత్ర పోషించనున్నారు. వాలియా రాకతో వాయుసేన యుద్ధ సామర్థ్యాలు మరింత పటిష్టం కానున్నాయి.

లింగ వివక్షకు బలైపోయిన గర్భిణి

- అబార్షన్ చేయించిన 24 గంటల్లోనే మృతి!

మొదటిపేజీ తరువాయి.. సమాజంలో ఇంకా వేళ్లూనుకుపోయిన అక్షరాస్యత లేమి, లింగ వివక్ష కారణంగా మరో నిండు ప్రాణం బలైంది. ఆడపిల్ల కడుపులో ఉందనే కారసణంతో భర్త, అత్తింటివారు బలవంతంగా గర్భస్రావం చేయించడంతో 24 ఏళ్ల కిరణ్ కుమారి మరణించింది. సోను కేవత్ భార్య అయిన కిరణ్ కుమారి గర్భవతిగా ఉన్న సమయంలో శ్యామ్‌బిహ్‌లోని సెంట్రల్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో భ్రూణ లింగ నిర్ధారణ పరీక్ష చేయించారు.కడుపులో ఆడపిల్ల ఉందని తేలడంతో భర్త సోను కేవత్, ఇతర కుటుంబ సభ్యులు ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించారు. మగబిడ్డ కావాలనే దురాశతో బలవంతంగా గర్భస్రావానికి ఒత్తిడి తెచ్చారు. అత్తింటివారి ఒత్తిడికి తలవంచి ఆమె అబార్షన్ చేయించుకోగా, ఆ ప్రక్రియ వికటించి లేదా ఆరోగ్యం క్షీణించి సరిగ్గా 24 గంటల్లోనే ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి రాజేంద్ర కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు నిజాలు బయటపడ్డాయి.పోలీసులు ఈ కేసును అత్యంత గంభీరంగా తీసుకుని దర్యాప్తు జరిపారు. భర్త సోను కేవత్‌తో పాటు, అక్రమంగా పరీక్షలు నిర్వహించిన డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడు, సిబ్బంది, నర్సును కలిపి మొత్తం నలుగురిని అరెస్టు చేశారు. గర్భస్రావం జరిగిన తీరు, వైద్యుల పాత్రపై లోతుగా విచారణ జరుపుతున్నారు. ప్రతి శిశువుకు జీవించే హక్కు ఉందని, చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

తాగునీటికి ఇక పటిష్ట రక్షణ - అందుబాటులోకి భాగ్యనగర 'గ్రీన్ వాటర్' సేవలు!

మొదటిపేజీ తరువాయి.. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పార్కుల నిర్వహణకు గ్రీన్ వాటర్ వాడకాన్నే తప్పనిసరి చేయనున్నట్లు వివరించారు. తొలి దశలో భాగంలో 19 శుద్ధి కేంద్రాల (STP) ద్వారా 28 ప్రత్యేక ట్యాంకర్లతో సరఫరా చేపట్టనున్నారు. ముఖ్యంగా మియాపూర్, గోపన్‌పల్లి, కోకాపేట్, అత్తాపూర్, అంబర్‌పేట్, నాగోల్ వంటి రద్దీ ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభించారు. భవిష్యత్తులో నగరమంతటా ఈ సేవలు లభించేలా ప్రణాళిక రూపొందించారు. తాగునీటి అవసరం లేని పనుల కోసం మంచినీటిని వృథా చేయకుండా, రీసైకిల్ చేసిన నీటిని అందించడం ద్వారా తాగునీటి వనరులను భద్రపరచవచ్చని జల మండలి ఆశిస్తోంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏతో పాటు పైవేటు ఏజెన్సీలకు చెందిన సుమారు 100 ట్యాంకర్లు ఇప్పటికే గ్రీన్ వాటర్ నెట్‌వర్క్‌లో నమోదు చేసుకున్నాయి. వీటికి ప్రత్యేక ప్రచార రంగులను కేటాయించారు. సరఫరాలో ఎలాంటి గోల్‌మాల్ జరగకుండా జీపీఎస్ ఆధారిత నావిగేషన్, ముందస్తు నమోదు, ఆన్‌లైన్ పేమెంట్ వ్యవస్థలను సిద్ధం చేశారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా, ఈ ట్యాంకర్ల నీరు తాగడానికి సురక్షితం కాదని స్పష్టమైన ముద్రలు ప్రదర్శించడం విశేషం. రాబోయే కాలంలో ఎల్‌నినో కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుంచే నీటి పొదుపు చర్యలు చేపట్టడం శ్రేయస్కరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రారంభంలో 167 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న జల మండలి సేవలు ప్రస్తుతం 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించాయి. నగర వేగానికి అనుగుణంగా నీటి పునర్వినియోగ వ్యవస్థను బలోపేతం చేయడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. జల మండలి 37వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యోగులకు అభినందనలు తెలిపిన ఎండీ, హైదరాబాద్‌ను నీటి కొరత లేని నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

చౌటుప్పల్‌లో జోగిని హత్య.. రూ.లక్షల సొత్తు దోపిడీ!

మొదటిపేజీ తరువాయి.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలో దారుణ సంఘటన వెలుగుచూసింది. జోగినిగా పేరు పొందిన రాళ్లబండి సుధాకర్ తన నివాసంలోనే దారుణంగా హత్యకు గురయ్యారు. హత్య చేసిన దుండగులు ఇంట్లోని భారీ మొత్తంలో బంగారం, రొక్కాన్ని ఎత్తుకెళ్లడం స్థానికంగా తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు సుధాకర్‌పై దాడి చేసి ప్రాణాలు తీశారు. అనంతరం ఇల్లంతా వెతికి విలువైన ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన పక్కా ప్రణాళిక ప్రకారమే జరిగిందని స్థానికులు భావిస్తున్నారు.దుండగులు సుధాకర్ ఇంట్లో ఉన్న దాదాపు 60 తులాల బంగారు నగలు, రూ.10 లక్షల నగదును తీసుకెళ్లినట్లు సమాచారం. ఇంత పెద్దమొత్తంలో సొత్తు ఇంట్లో ఉందనే సమాచారం తెలిసిన వారి ప్రమేయం ఉందా అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. సుధాకర్ పరిచయస్థులు, ఆయనతో ఆర్థిక లావాదేవీలు ఉన్న వారి జాబితాను సేకరిస్తున్నారు.ఘటన జరిగిన తర్వాత నిందితులు సుధాకర్‌కు చెందిన కారులోనే పరారవ్వడం గమనార్హం. పారిపోయేందుకు యజమాని కారునే వాడటంతో పోలీసులు చుట్టుపక్కల ప్రాంతాల్లోని చెక్‌పోస్టులను హెచ్చరించారు. సీసీ కెమెరా దృశ్యాల ద్వారా కారు ప్రయాణించిన మార్గాన్ని గుర్తిస్తు న్నారు. అసలు దుండగులు ఎంతమంది వచ్చారు, వారి కదలికలు ఎలా ఉన్నాయి అనే అంశాలపై స్పష్టత కోసం దర్యాప్తు చేస్తున్నారు.పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ నిపుణులు ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర కీలక సాక్ష్యాలను నమోదు చేసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రశాంతంగా ఉండే చౌటుప్పల్‌లో ఒకేసారి హత్య, దోపిడీ, కారు అపహరణ జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ హత్య వెనుక అసలు కారణాలు ఏమిటనేది నిందితుల అరెస్టు తర్వాతే వెల్లడయ్యే అవకాశం ఉంది.

'కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు' : కేటీఆర్ ధ్వజం!

మొదటిపేజీ తరువాయి.. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ లో నిర్వహించిన రైతు గర్జన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన సృష్టి అని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావం అంటూ బాధ్యతల నుంచి తప్పుకోవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నిలిపివేసిన మూడు విడతల రైతుబంధు బకాయిలతో పాటు ప్రస్తుత యాసంగి పెట్టుబడి సాయాన్ని కలిపి ప్రతి ఎకరానికి రూ.60 వేల చొప్పున వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు సైతం ఆర్థిక సహాయం అందించాలని స్పష్టం చేశారు.తెలంగాణతో పోలిస్తే రెండింతల వర్షపాతం లోటు ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కరువు పరిస్థితులు లేవని, నీళ్లు, వనరులు పుష్కలంగా ఉన్న మన రాష్ట్రంలోనే పాలనా వైఫల్యం వల్ల రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఎకరానికి ఏటా రూ.10 వేల రైతుబంధు అందిస్తే, తాము అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తామని చెప్పి రేవంత్ రెడ్డి రైతులను ఘోరంగా మోసం చేశారని విమర్శించారు. నాలుగు పంటల కాలానికి సాయం అందక రైతులు సంక్షోభంలో కూరుకుపోయారని, రూ.2 లక్షల రుణమాఫీ, కౌలు రైతు సాయం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా హామీలన్నీ అటకెక్కాయని మండిపడ్డారు.ప్రస్తుతం రైతులు స్వీయ ధ్రువీకరణ ఇచ్చి భూములను బీడుగా ఉంచుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి దాపురించిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతులకు ఇచ్చేందుకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం ఢిల్లీకి మాత్రం క్రమం తప్పకుండా పంపిస్తోందని 'రాహుల్ బంధు' పేరుతో ఎద్దేవా చేశారు. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, విద్యుత్ వ్యవస్థను కూడా ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని, రాష్ట్రంలో పాలనకు సెలవు ప్రకటించినట్లు ఉందన్నారు. 'నల్లమల పిల్లి' లాంటి పాలన కొనసాగుతోందని వ్యాఖ్యానించిన కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే త్వరలోనే సెలవు ప్రకటిస్తారని హెచ్చరించారు.

ఓటు హక్కు హరిస్తే ఊరుకోం..!

మొదటిపేజీ తరువాయి.. భారత ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన భారీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న పారదర్శకతా లోపాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ ఉద్యమం కేవలం ఒక పార్టీది కాదని, దేశంలోని కోట్లాది మంది ప్రజల హక్కుల పోరాటమని చెప్పారు. వ్యవస్థలను ఎంతగా శాసిస్తున్నప్పటికీ రాజ్యాంగానికి మించిన శక్తి దేశంలో మరొకటి లేదని స్పష్టం చేశారు.బెంగాల్, మహారాష్ట్ర, హర్యానా, కర్ణాటక వంటి పలు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల మార్పులు, ఈవీఎంల పనితీరుపై తీవ్ర అనుమానాలు ఉన్నాయని రాహుల్ తెలిపారు. గత ఎన్నికల అనంతరం ఏకంగా 13.5 కోట్ల ఓట్లను తొలగించారని, దీనిపై ఎన్నికల కమిషన్ బదులు చెప్పాలని నిలదీశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని, ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థల్లో ఆర్ఎస్ఎస్ జోక్యం పెరిగిపోయిందని, ప్రజాస్వామ్య సంస్థలన్నీ ప్రజలకే చెందాలని స్పష్టం చేశారు.అంబానీ, అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తల వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తూ, సామాన్య రైతులు, వ్యాపారులపై భారం మోపుతున్నారని రాహుల్ విమర్శించారు. విద్య, వైద్యం, రైల్వేలు కొద్దిమంది చేతుల్లో బంధీ కాకుండా ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు లభించే భారత్ తమ ఆకాంక్ష అని వివరించారు. ఈ పోరాటం వ్యక్తులపై కక్షతో కాకుండా గాంధీజీ చూపిన ప్రేమ, అహింస మార్గంలో సాగుతుందని తెలిపారు. మతాలు, కులాలకు అతీతంగా చివరి వరుసలో ఉన్న నిరుపేదడి హక్కుల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.

గువహటిలో అత్యాధునిక క్యాన్సర్ ఆసుపత్రి..!

సామాన్యుడికి అందుబాటులోకి ప్రోటాన్ థెరపీ

మొదటిపేజీ తరువాయి.. దేశంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో అసోం ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. దేశంలోనే తొలి ప్రభుత్వ ఆధారిత ప్రోటాన్ బీమ్ థెరపీ కేంద్రాన్ని గువహటి మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌లో నెలకొల్పనుంది. ఇందుకోసం అంతర్జాతీయ ప్రసిద్ధి చెందిన 'అయాన్ బీమ్ అప్లికేషన్స్' (బెల్జియం) కంపెనీతో శనివారం అధికారిక ఒప్పందం జరిగింది. లోక్ సేవా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పాల్గొన్నారు. రాబోయే మూడేళ్లలో పూర్తికానున్న ఈ ప్రాజెక్టు వల్ల పేదలకు కూడా అత్యాధునిక క్యాన్సర్ వైద్యం ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో దక్కనుంది.ప్రస్తుతం ప్రైవేట్ రంగంలోనే లభ్యమవుతున్న ఈ ప్రోటాన్ చికిత్సకు సుమారు రూ.50 లక్షల వరకు వ్యయమవుతోంది. దీనివల్ల నిరుపేదలు ఈ వైద్యాన్ని పొందలేకపోతున్నారు. ఈ వ్యత్యాసాన్ని తొలగించి, సర్కారీ దవాఖానాలోనే ఈ సదుపాయం తేవడానికి అసోం ప్రభుత్వం (రూ.285 కోట్లు), ప్రపంచ బ్యాంకు (రూ.315 కోట్లు) కలిసి రూ.600 కోట్ల నిధులు కేటాయించాయి. ఒప్పందంలో భాగంగా సదరు విదేశీ సంస్థ యంత్రాల ఏర్పాటుతో పాటు ఇక్కడి వైద్యులు, సాంకేతిక సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనుంది.సాధారణ రేడియేషన్‌తో పోలిస్తే ప్రోటాన్ థెరపీలో క్యాన్సర్ కణతులపైనే నేరుగా కిరణాలను ప్రసరింపజేసి చుట్టూ ఉన్న ముఖ్యమైన అవయవాలను కాపాడవచ్చు. మెదడు, వెన్నెముక క్యాన్సర్లు మరియు పిల్లలలో వచ్చే కణితులకు ఇది అత్యంత ప్రయోజనకరమైనది. ఈశాన్య భారతంలో 7 రాష్ట్రాల ప్రజలకు ఇతర నగరాలకు వెళ్లే పనిలేకుండా గువహటిలోనే సకల సౌకర్యాలతో సమగ్ర క్యాన్సర్ చికిత్స అందించడానికి ఈ కేంద్రం దోహదపడనుంది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సీసీ రోడ్ల బిల్లులపై వివాదం..
మాజీ సర్పంచ్ ఫిర్యాదులతో రాజకీయ రగడ!

- రూ.30 లక్షల పనులపై ఆరోపణలు.. నిబంధనల ప్రకారమే పనులు చేపట్టాం
- రూ.3.14 లక్షల నిలిపివేత నిధులూ నాణ్యతా పరీక్షల తర్వాత విడుదలయ్యాయి
- వ్యక్తిగత కక్షతోనే నాపై తప్పుడు ఫిర్యాదులు.. ఉపసర్పంచ్ బొల్లం ప్రకాశ్ వివరణ



హనుమకొండ జిల్లా / ఐనవోలు, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : గ్రామాభివృద్ధి కోసం చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఇప్పుడు రాజకీయ వివాదానికి దారితీశాయి. గత పాలకవర్గ హయాంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సుమారు రూ.30 లక్షల విలువైన పనుల బిల్లుల వ్యవహారంపై మాజీ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. మాజీ సర్పంచ్ కంజర్ల రమేష్ వ్యక్తిగత కక్షతోనే తనపై తప్పుడు ఫిర్యాదులు చేస్తూ వేధిస్తున్నారని మాజీ ఉపసర్పంచ్ బొల్లం ప్రకాశ్ ఆరోపించారు. పనులన్నీ నిబంధనల ప్రకారమే చేపట్టామని, అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరారు.

2019–2024 పాలకవర్గంలో కీలక బాధ్యతలు

బొల్లం ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నుంచి 2024 వరకు కక్కిరాలపల్లి గ్రామ పంచాయతీలో తాను ఉపసర్పంచ్‌గా, కంజర్ల రమేష్ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. 2021–2022 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అప్పటి సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ తాటికాయల రమేష్, వార్డు సభ్యుల సమక్షంలో పనుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారని వివరించారు. అనంతరం కాంట్రాక్టర్ల సహకారంతో గ్రామంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులు పూర్తిచేసినట్లు తెలిపారు.

రూ.30 లక్షలకు పైగా బిల్లులు.. రూ.3.14 లక్షల విడుదల

సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.30 లక్షలకు పైగా బిల్లులు మంజూరయ్యాయని ప్రకాశ్ వెల్లడించారు. అయితే నాణ్యతా నియంత్రణ పరీక్షల సందర్భంగా కొంత మొత్తాన్ని నిలిపివేశారని తెలిపారు. అనంతరం సంబంధిత నాణ్యతా నియంత్రణ అధికారులు, సహాయ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి నాణ్యతపై విచారణ చేపట్టారని పేర్కొన్నారు. పనుల పరిశీలన అనంతరం నిలిపివేసిన రూ.3,14,000 మొత్తాన్ని 2026 జూలై 14న విడుదల చేసినట్లు తెలిపారు. నాణ్యతా పరీక్షల అనంతరం నిధులు విడుదలైనప్పటికీ, అదే వ్యవహారాన్ని వివాదాస్పదం చేస్తూ తనపై ఫిర్యాదులు చేయడం వెనుక వ్యక్తిగత కక్ష ఉందని ఆరోపించారు.

బాధ్యతలు అప్పగించినప్పుడు అందరూ ఉన్నారు.. ఇప్పుడు నాపైనే ఆరోపణలా?

గ్రామాభివృద్ధి కోసం చేపట్టిన పనులను అప్పటి పాలకవర్గ సభ్యుల సమక్షంలోనే నిర్వహించామని, ఉపసర్పంచ్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించానని ప్రకాశ్ స్పష్టం చేశారు. పనులు పూర్తయిన తర్వాత బిల్లులు మంజూరయ్యాయని, నాణ్యతా పరీక్షల అనంతరం నిలిపివేసిన మొత్తాన్ని కూడా విడుదల చేశారని వివరించారు. అయినప్పటికీ మాజీ సర్పంచ్ వరుస ఫిర్యాదులతో తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని, విచారణలో వాస్తవాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు.

సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి

కక్కిరాలపల్లి గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులపై కలెక్టర్, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, గ్రామ కార్యదర్శి స్పందించాలని బొల్లం ప్రకాశ్ కోరారు. పనుల నిర్వహణ, నిధుల మంజూరు, నాణ్యతా పరీక్షల నివేదికలు, సంబంధిత రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. తనపై చేసిన ఆరోపణల్లో వాస్తవాలు ఉంటే విచారణలో నిర్ధారించాలని, లేనిపక్షంలో వ్యక్తిగత కక్షతో తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదల స్థలాలు కబ్జా చేస్తే ఊరుకునేది లేదు!

- వైఎస్సార్ కాలనీవాసులకు రక్షణ కల్పించాలి..
- 30 ఏళ్లుగా నివసిస్తున్న వారి హక్కులను కాపాడాలి
- భూ రికార్డులు ఎలా మారాయో ఎమ్మెల్యే నాయిని సమాధానం చెప్పాలి
- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హెచ్చరిక



హనుమకొండ/కాజీపేట, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాజీపేట వైఎస్సార్ కాలనీలో దశాబ్దాలుగా నివాసముంటున్న నిరుపేదల స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ నాయకుడు దాస్యం వినయ్‌భాస్కర్ హెచ్చరించారు. పేద ప్రజల హక్కులను కాలరాస్తూ వారి నివాస స్థలాలను కబ్జా చేయాలని చూస్తే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం తక్షణమే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కాజీపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కాలనీలో గత 30 ఏళ్లకు పైగా పేద కుటుంబాలు నివాసముంటున్నాయని తెలిపారు. 2009లో నిరుపేదల గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నించిన సమయంలో తాము అడ్డుకుని వారికి అండగా నిలిచామని గుర్తుచేశారు. అప్పట్లో పేదల పక్షాన పోరాడి వారి నివాసాలకు రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఎండ్ గతంలో కడియం శ్రీహరి మంత్రిగా ఉన్న సమయంలో వైఎస్సార్ కాలనీవాసులకు పూర్తిస్థాయి హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు భూ ఆక్రమణదారులతో కుమ్మక్కయ్యారంటూ ఆరోపించారు. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వైఎస్సార్ కాలనీ భూములకు సంబంధించిన రికార్డులు ఎలా మారాయి? వాటి వెనుక ఉన్న పరిణామాలేమిటి? అనే అంశాలపై స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భూ రికార్డుల మార్పులపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. వైఎస్సార్ కాలనీలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. పేదల ఇళ్లకు, స్థలాలకు రక్షణగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఎంజీఎం మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వేగవంతం చేయాలి

- నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి
- అధికారులకు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశం





హనుమకొండ, నవంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఎంజీఎం మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ఆదివారం ఆస్పత్రి వెలుపల చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు పూర్తయిన పనులు, వివిధ విభాగాల్లో కొనసాగుతున్న నిర్మాణాలు, ప్రస్తుత పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్మాణ పనులను నిర్ణీత ప్రణాళిక ప్రకారం త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పనుల్లో జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పరిశీలనలో రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ సురేష్ బాబు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పర్యవేక్షక ఇంజినీర్ రాజ్‌కుమార్, రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ దేవిక చౌహాన్, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అకాల మరణం పొందిన సభ్యుడి కుటుంబానికి పాదుపు సంఘం అండ

- మృతుడి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత



వరంగల్ జిల్లా/పర్వతగిరి, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) ఆపద సమయంలో సభ్యుడి కుటుంబానికి అండగా నిలిచి శ్రీ కంఠమహేశ్వర పాదుపు సంఘం సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల అన్నారం గ్రామానికి చెందిన సంఘం సభ్యుడు దీకొండ సోమయ్య గౌడ్ అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబానికి సంఘం సభ్యులు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించే దిశగా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సంఘం తరపున మృతుడి కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కష్టసమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంఘం సభ్యుల ఐక్యత, సేవాభావం పట్ల గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలవడమే నిజమైన సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ప్రజావాణి నిర్వహణ
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు జిల్లా, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి)
ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ రావు సూచించారు. ఈ నెల 2వ తేదీ సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ములుగు రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లోనూ ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ స్థాయిలో సంబంధిత అధికారులు, మండల స్థాయిలో మండల అధికారులు ప్రజావాణి నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ప్రజావాణిలో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

వరంగల్ తూర్పులో బీజేపీలోకి 50 మందికి పైగా మైనార్టీ కార్యకర్తలు!

- సీపీఎం మైనార్టీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి అక్మల్ పాషా ఆధ్వర్యంలో చేరికలు
- కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు



వరంగల్, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్ తూర్పు నియోజక వర్గంలో భారతీయ జనతా పార్టీకి పలువురు కార్యకర్తలు చేరారు. పోచమ్మ మైదాన్ 22వ డివిజన్‌కు చెందిన సీపీఎం రాష్ట్ర మైనార్టీ విభాగం సహాయ కార్యదర్శి ఎండీ అక్మల్ పాషా ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన 50 మందికి పైగా మైనార్టీ కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకం కాదని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి బీజేపీ కృషి చేస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పార్టీలో నూతనంగా చేరిన నాయకులు, కార్యకర్తలు బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, సంఘని జగదీశ్వర్, విప్ప సుధాకర్, ఎండీ పాషా, జన్ను సుబ్రమణ్యం, బల్యారి రాజు, జన్ను నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ సమరశంఖం!





న్యూఢిల్లీ, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ గళమెత్తింది. అర్హులైన పౌరుల ఓటు హక్కుకు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పారదర్శకంగా సాగాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ 'ఓట్ బచావో – దేశ్ బచావో' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, కాంగ్రెస్ న్యాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీమ్మాని శేఖర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఓటు హక్కు అనేది కేవలం ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం మాత్రమే కాదని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు, ఆయుధమని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ఎన్నికల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు, పక్షపాతానికి తావు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని అన్నారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం ఎన్నికల వ్యవస్థ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. 'ఓటు హక్కును కాపాడటమే ప్రజాస్వామ్యాన్ని కాపాడటం' అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సారంగపాణి, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, జిల్లా నాయకుడు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తూళ్ల రవి పాల్గొన్నారు. అలాగే ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి యాదగిరి, వర్ధన్నపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొక్కల ప్రమోద్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిర్రు రాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల సమన్వయకర్త కుల్ల యాకాంతం, దమ్మన్నపేట గ్రామ సర్పంచ్ దుబ్బ అంజయ్య, ల్యాబర్తి ఉపసర్పంచ్ సంకినేని గంగరాజుతో పాటు పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా శేర్ల అనిల్ కుమార్

- రంగశాయిపేట వాకర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం



వరంగల్, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా నూతనంగా నియమితులైన ప్రముఖ న్యాయవాది, సామాజికవేత్త, లయన్ శేర్ల అనిల్ కుమార్‌ను రంగశాయిపేట వాకర్స్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఉదయం సొసైటీ అధ్యక్షుడు బక్కి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శేర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. తనను ఘనంగా సన్మానించిన వాకర్స్ సొసైటీ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనకు లీగల్ సెల్ కన్వీనర్‌గా అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, తూర్పు నియోజక వర్గ ఇన్‌చార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు న్యాయపరంగా అండగా ఉంటానని పేర్కొన్నారు. రంగశాయిపేట ప్రాంత అభివృద్ధితో పాటు వాకర్స్ సొసైటీ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుత జీవన విధానంలో పని ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణకు నడక ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, ప్రతిరోజూ కనీసం 15 నిమిషాల పాటు నడకకు సమయం కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సొసైటీ సభ్యులు బక్కి నాగేందర్, కందికొండ కుమారస్వామి, పోతు రమేష్, కుల్ల వీరస్వామి, బజ్జూరి ప్రభాకర్, శంకేశి నక్కి, గుండు మోహన్, శంకేశి రాజేష్, కేదాసి రాజేష్, కేడల అశ్విన్, ఎలుగు ఉపేందర్, పాకాల రాఘవ, పోతు రజనీకాంత్, పస్తం బిక్షపతి తదితరులు పాల్గొని అనిల్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఇంటికీ వెళ్లి పోలీసుల అవగాహన.. సైబర్ మోసాలు, మత్తు పదార్థాలపై హెచ్చరిక !

- పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి: ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్



హన్మకొండ ,నవంబర్ 01(నిత్యం నిఘా ప్రతినిధి) : ప్రజలను నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేయడమే లక్ష్యంగా హన్మకొండ పోలీసులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక రెడ్డి కాలనీలో ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది కాలనీలోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలతో నేరుగా మాట్లాడారు. రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం, ఆస్తి సంబంధిత నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యువత, చిన్నారులు మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఇన్స్పెక్టర్ సూచించారు. పిల్లల ప్రవర్తన, స్నేహితుల పరిచయాలు, రోజువారీ కార్యకలాపాలను నిరంతరం గమనిస్తూ వారికి తగిన మార్గదర్శనం చేయాలని కోరారు. అలాగే, ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ నేరాల సహాయ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి అవగాహన కల్పించడం ద్వారా నేరాల నివారణలో ప్రజలను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

25 ఏళ్లుగా నివాసం.. ఇప్పుడు గుడిసె తొలగించాలంటూ వేధింపులు!

- ప్రభుత్వ రోడ్డు లేకున్నా రోడ్డు కోసం ఒత్తిడి చేస్తున్నారని బాధిత కుటుంబం ఆవేదన
- తమ బతుకులను రోడ్డున పడేయొద్దు.. అధికారులే న్యాయం చేయాలి



హన్మకొండ, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): హన్మకొండ జిల్లా పలివెలుపుల గ్రామంలో గత 25 ఏళ్లుగా నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి స్థానికంగా కొందరి నుంచి వేధింపులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఏళ్ల తరబడి గుడిసె వేసుకుని జీవిస్తున్న తమను అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు, గుడిసె తొలగించి రోడ్డు వేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని చల్ల చేరాలు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాతికేళ్లుగా ఇదే నివాసం..

చల్ల చేరాలు కుటుంబం గత పాతికేళ్లుగా పలివెలుపుల గ్రామంలోని ఒక స్థలంలో గుడిసె వేసుకుని నివసిస్తోంది. కష్టపడి జీవనం సాగిస్తున్న తమకు ఆ స్థలమే ఆధారమని బాధితులు చెబుతున్నారు. ఇన్నేళ్లుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవిస్తున్న తమకు ఇప్పుడు కొందరి వ్యవహారశైలి వల్ల మనశ్శాంతి కరువైందని వాపోతున్నారు.

గుడిసె తొలగించాలంటూ ఒత్తిడి?

ప్రభుత్వ రోడ్డు లేని చోట రోడ్డు నిర్మాణం పేరుతో తమ గుడిసెను తొలగించాలని కొందరు ఒత్తిడి తెస్తున్నారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. తమ నివాసానికి ఇబ్బంది కలిగిస్తూ మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. నిరుపేదలమనే కారణంతో తమను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తోంది.

అధికారులు జోక్యం చేసుకోవాలి

25 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమకు న్యాయం చేయాలని చల్ల చేరాలు కుటుంబం అధికారులను వేడుకుంటోంది. స్థలానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రభుత్వ రోడ్డు ఉందా లేదా అనే అంశంపై విచారణ జరపాలని కోరుతోంది. తమ నివాసానికి రక్షణ కల్పించి, బలవంతపు చర్యలు లేదా బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది. బాధిత కుటుంబం చేస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో విచారణ చేపడతారా? నిరుపేద కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాలి.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు.. వెంటనే ఐకేపీ కేంద్రాలు ప్రారంభించాలి!

- **రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి**
- **బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ డిమాండ్**



ఎల్కతుర్తి, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఎల్కతుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెలల తరబడి కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ఎక్కడ విక్రయించాలో తెలియక ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోతే దళారులు రంగప్రవేశం చేసి రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, తూకం యంత్రాలు, హమాలీలు, రవాణా సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రైతులకు తాగునీరు తదితర కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో నగదు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ధాన్యం కొనుగోళ్లపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా, పంటకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఎలాంటి జాప్యం లేకుండా మండలంలోని అన్ని గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు భరోసా కల్పించాలని మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు.

మహిళా పోలీసుల ఆత్మీయ సమ్మేళనం.. 360 మందితో సందడి!

- **కుటుంబ బాధ్యతలతో పాటు విధుల్లోనూ మహిళా సిబ్బంది ప్రతిభ అభినందనీయం**



వరంగల్, నవంబర్ 01(నిత్యం నిఘా ప్రతినిధి) : కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే పోలీసు విధుల్లో అంకితభావంతో పనిచేస్తున్న మహిళా పోలీసు సిబ్బంది సేవలు అభినందనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు అధికారులు, సిబ్బందికి శనివారం భీమారంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హోంగార్డుల నుంచి ఉన్నతాధికారుల వరకు సుమారు 360 మంది మహిళా సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మహిళా సిబ్బంది కుటుంబ బాధ్యతలతో పాటు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువస్తున్నారని ప్రశంసించారు. మహిళా పోలీసుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయడం, వారి ఆరోగ్యం, సంక్షేమంపై అవగాహన కల్పించడంతో పాటు ఆత్మీయ వాతావరణంలో తమ సమస్యలు, అనుభవాలను పంచుకునే అవకాశం కల్పించడమే ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య, కుటుంబ, వృత్తిపరమైన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. న్యూట్రిషనిస్ట్ శ్రీలత మాట్లాడుతూ సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు. సైకాలజిస్ట్ ప్రొఫెసర్ రాధా మాట్లాడుతూ కుటుంబ, వృత్తిపరమైన ఒత్తిళ్లను అధిగమించేందుకు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరమన్నారు. భావోద్వేగాలను నియంత్రించుకోవడం, సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవడం, తగినంత విశ్రాంతి తీసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు, సహచరుల సహకారం పొందడం ద్వారా మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఇన్‌స్పెక్టర్లు సువర్ణ, సుజాత, ఎస్సైలు కిరణ్మయి, శ్రావణి, లలిత, స్వాతితో పాటు పలువురు మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన నష్టంపై సమాధానం చెప్పాలి!



వరంగల్/ పర్వతగిరి, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ నాయకులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు తమ పాలనలో జరిగిన పరిణామాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని తెలంగాణ కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల సమన్వయకర్త, పర్వతగిరి మండలానికి చెందిన వంగ సాయికృష్ణ యాదవ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించకుండా రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగ సమస్య, రైతుల ఇబ్బందులు, విద్యా, వైద్య రంగాల అభివృద్ధి వంటి అంశాలపై అనేక ప్రశ్నలు తలెత్తాయని పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసిందని, కాగ్ నివేదికలోనూ ప్రాజెక్టు వ్యయం, ప్రణాళిక, అమలుకు సంబంధించి పలు అంశాలు ప్రస్తావించబడ్డాయని గుర్తుచేశారు. అలాగే రాష్ట్ర అప్పులు, వడ్డీ భారం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన, రైతులకు సాగునీరు, గిట్టుబాటు ధర, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో గత ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, అర్హులకు రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ తదితర నియామక ప్రక్రియలు చేపట్టిందని, నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు గృహ నిర్మాణ సహాయం అందించడం, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, సామాజిక సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులకు ఆయన పలు ప్రశ్నలు సంధించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఉంటే నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ నివేదికలో ప్రస్తావించిన అంశాలకు ఎవరు సమాధానం చెబుతారని, నిరుద్యోగ యువత ఎదుర్కొన్న సమస్యలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల భారం, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత గత ప్రభుత్వానికి లేదా అని నిలదీశారు. రాజకీయ విమర్శలు చేయడం సులభమని, కానీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం, వారి సమస్యలను పరిష్కరించడం ముఖ్యమని వంగ సాయికృష్ణ యాదవ్ పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనలో జరిగిన పనులు, ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు బేరీజు వేసుకుంటారని అన్నారు. ప్రతి ప్రభుత్వ పనితీరును ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉందని, విమర్శలకు సమాధానం అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలితాల ద్వారానే చెప్పాలని పేర్కొన్నారు.

మంత్రి సీతక్క చొరవతో మంగపేట-కాటాపూర్ రోడ్డు పనులు ప్రారంభం!

- **ఏళ్లుగా గుంతలమయమైన రహదారికి మోక్షం.. ఏడు గ్రామాల ప్రజలకు ఊరట**
- **అటవీశాఖ అడ్డంకులను అధిగమించి పనులకు శ్రీకారం.. సీతక్కకు గ్రామస్తుల కృతజ్ఞతలు**



ములుగు జిల్లా / తాడ్వాయి, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఏళ్లుగా అధ్వానంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న మంగపేట–కాటాపూర్ రహదారి నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడంతో పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో కాటాపూర్‌తో పాటు చుట్టుపక్కల ఏడు గ్రామపంచాయతీల ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాటాపూర్–మంగపేట మధ్య రహదారి పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ రహదారికి నిధులు మంజూరైనప్పటికీ అటవీశాఖ అనుమతులు, అభ్యంతరాల కారణంగా సుమారు మూడు కిలోమీటర్ల మేర పనులు నిలిచిపోయి మట్టి రహదారిగానే మిగిలిపోయింది. ఈ సమస్యను గుర్తించిన మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అటవీశాఖకు సంబంధించిన అడ్డంకులను అధిగమించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారని స్థానికులు తెలిపారు. రహదారి నిర్మాణ పనులు త్వరగా పూర్తయితే కాటాపూర్–మంగపేట మధ్య ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో పాటు ఇతర వాహనాల రాకపోకలు సులభతరం కానున్నాయి. ఏడు గ్రామాల ప్రజలకు విద్య, వైద్యం, వ్యాపార అవసరాల కోసం ప్రయాణాలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కాటాపూర్–అంబాపూర్ రహదారికి కూడా మంత్రి సీతక్క నిధులు మంజూరు చేయడం పట్ల అంబాపూర్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రహదారికి శిలాఫలకం ఏర్పాటు చేయడంతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవడం పట్ల సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంట్రాక్టర్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ నాయకులు ఇరుప సునీల్ దొర, పనాటి సత్యం, అంబాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, ముక్తి రామస్వామి, పాలకుర్తి బాబు, చిట్టినేని శ్రీనివాస్, జేసీబీ యజమాని శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివరాహ క్షేత్రంలో లడ్డూ ప్రసాదం కౌంటర్ ప్రారంభం

- **భక్తుల సౌకర్యార్థం నూతన ఏర్పాటు.. రూ.1,11,116 విరాళం అందించిన మంథని వాసి పాండ్రాల రాజు**



పెద్దపల్లి జిల్లా / కమాన్‌పూర్, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని స్వయంభు శ్రీ ఆదివరాహ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదం కౌంటర్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కౌంటర్ ఏర్పాటుకు మంథని పట్టణానికి చెందిన పాండ్రాల రాజు రూ.1,11,116 విరాళంగా అందజేసి తన భక్తిభావాన్ని చాటుకున్నారు. దాత పాండ్రాల రాజు చేతుల మీదుగా ఆలయ కమిటీ చైర్మన్ ముస్త్యాల దామోదర్, డైరెక్టర్లు పిల్లి రాజు, బుస శ్రీనివాస్, అనవేన శ్యామల సది, మల్యాల మల్లేష్, కొంతం శ్రీనివాస్ సమక్షంలో రిబ్బన్ కట్ చేసి కౌంటర్‌ను ప్రారంభించారు. అనంతరం భక్తులకు ప్రసాదం టికెట్లు అందజేసి లడ్డూలను పంపిణీ చేశారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం లడ్డూ ప్రసాదం కౌంటర్ ఏర్పాటుకు ఉదారంగా విరాళం అందించిన పాండ్రాల రాజును ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కిషన్ రెడ్డి, శివ శంకర్, రెబల్ రాజ్‌కుమార్, గడ్డం రాజమహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సీనియర్ జర్నలిస్టు పెండ్యాల రామ్‌కుమార్ మృతి పాత్రికేయ లోకానికి తీరని లోటు!

- **మంథని ప్రెస్‌క్లబ్ సభ్యుల తీవ్ర దిగ్భ్రాంతి.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**



పెద్దపల్లి జిల్లా / మంథని, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : ప్రజాక్రాంతి పత్రిక సీనియర్ జర్నలిస్టు, మంథని డివిజన్ మీడియా ప్రెస్‌క్లబ్ సభ్యుడు పెండ్యాల రామ్‌కుమార్ అకాల మరణం పట్ల మంథని ప్రాంత పాత్రికేయులు తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. పాత్రికేయ రంగంలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న రామ్‌కుమార్ మృతి పాత్రికేయ లోకానికి, ముఖ్యంగా మంథని ప్రాంత మీడియా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. మంథని డివిజన్ మీడియా ప్రెస్‌క్లబ్ తరపున కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆదివాసీ హక్కుల కోసం మహా ధర్నా.. ప్రతి ఒక్కరూ కదలాలి!

ములుగు జిల్లా/వాజేడు, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఆదివాసీల హక్కుల పరిరక్షణకు, 1/70 చట్టం, పీసా చట్టాల సమర్థవంతమైన అమలుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆదివాసీ నవనిర్మాణ సేన (ఏఎన్ఎస్) రాష్ట్ర సామాజిక మాధ్యమాల ప్రతినిధి పాయం అజయ్ పిలుపునిచ్చారు. నవంబర్ 2న వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివాసీ హక్కుల సాధన కోసం నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. వాజేడు మండలం పెనుగోల్ గ్రామంలో ఏఎన్ఎస్ నాయకుడు పాయం శివాజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాయం అజయ్ మాట్లాడుతూ ఆదివాసీ సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువతీ యువకులు, మహిళలు, ఆదివాసీ పెద్దలు అధిక సంఖ్యలో మహా ధర్నాకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ హక్కుల చట్టాల అమలు కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, భవిష్యత్ తరాల హక్కులు, భవిష్యత్తు భద్రంగా ఉండాలంటే ఇప్పుడే ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు.1/70, పీసా చట్టాలు ప్రస్తుతం అమలు విషయంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు ఇప్పటికైనా మేల్కొని తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాడకపోతే భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎన్ఎస్ నాయకులు పాయం శివాజీ, కృష్ణమూర్తి, బొగ్గుల మల్లయ్య, సారక్క, రవి, మహేష్, రజనీకాంత్, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లెం విజయ డెయిరీ ఎన్నికల్లో కమలం వికాసం!



హనుమకొండ, అక్టోబర్ 31 (నిత్యం నిఘా ప్రతినిధి) : జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం కళ్లెం గ్రామంలోని విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో డైరెక్టర్ పదవికి పోటీ చేసిన నకిర్త స్వప్న–నాగరాజు భారీ మెజారిటీతో గెలుపొందారు. ఫలితాలు వెలువడగానే బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కళ్లెం గ్రామ ప్రజలు, పాల ఉత్పత్తిదారులు తమ అభ్యర్థిపై ఉంచిన నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ఎన్నికల్లో మద్దతుగా నిలిచిన గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామస్థాయిలో బీజేపీకి పెరుగుతున్న ఆదరణకు ఈ విజయం నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తా!

డైరెక్టర్‌గా ఎన్నికైన నకిర్త స్వప్న–నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. విజయ డెయిరీ పరిధిలోని పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారానికి, రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్ నకిర్త స్వప్న–నాగరాజుకు గ్రామ పెద్దలు, బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వర్ధన్నపేటలో కోతుల బెడద.. ప్రజలకు కంటిమీద కునుకు కరువు!

- **వీధులు, వ్యాపార సముదాయాల్లో కోతుల స్వైరవిహారం.. వ్యాపారులు, ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు !**



వర్ధన్నపేట, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులు, వ్యాపార సముదాయాలు, రద్దీ ప్రాంతాల్లో కోతుల గుంపులు యథేచ్ఛగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. దీంతో వ్యాపారులు, పాదచారులు, ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. దుకాణాల వద్దకు చేరి వస్తువులు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, వాటి కోసం దాడులకు దిగడం, రహదారులపై అడ్డంగా సంచరించడం వంటి ఘటనలతో వ్యాపారులు సతమతమవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, ద్విచక్ర వాహనదారులు కోతుల సంచారంతో భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎక్కడి నుంచి కోతులు వచ్చి దాడి చేస్తాయోనన్న ఆందోళనతో ప్రజలు రోడ్లపై తిరగాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. కోతుల బెడద కారణంగా దుకాణాలను ప్రశాంతంగా నిర్వహించుకోలేకపోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు సరైన పరిష్కారం లభించలేదని పట్టణవాసులు వాపోతున్నారు.

అధికారులు స్పందించేది ఎప్పుడో?

ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని కోతులను సురక్షితంగా పట్టుకుని, తగిన ఏర్పాట్లతో తరలించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని కోరుతున్నారు. కోతుల బెడద మరింత తీవ్రమై ప్రజలకు ప్రాణాపాయం కలగకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కట్రాలలో ఎయిర్‌టెల్ తవ్వకాలతో తాగునీటి తిప్పలు!





వర్ధన్నపేట, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : అభివృద్ధి పనుల పేరుతో చేపట్టిన తవ్వకాలు కట్రాల గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలను తెచ్చిపెట్టాయి. ఎయిర్‌టెల్ ఫైబర్ కేబుల్ ఏర్పాటులో భాగంగా రోడ్లపై చేపట్టిన తవ్వకాలతో తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతిన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ఐదు రోజులుగా నల్లా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారంలో సంబంధిత అధికారులు జాప్యం చేస్తున్నారనే ఆరోపణలతో గ్రామంలో అసహనం వ్యక్తమవుతోంది. వర్ధన్నపేట మండలంలోని కట్రాల గ్రామంలో గ్రామపంచాయతీ అనుమతితో ఎయిర్‌టెల్ ఫైబర్ కేబుల్ పనుల కోసం రోడ్లను తవ్వారు. ఈ క్రమంలో తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతిన్నడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తవ్వకాలు పూర్తయి ఐదు రోజులు గడుస్తున్నా పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ, సంబంధిత సంస్థ బాధ్యత తీసుకొని సమస్యను పరిష్కరించాల్సి ఉండగా, ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బిందెడు నీటి కోసం బోర్ల వద్ద బారులు!

నల్లా నీటి సరఫరా నిలిచిపోవడంతో పలు కాలనీల ప్రజలు తాగునీటి కోసం బోర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా మహిళలు బిందెలతో బోర్ల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాల సమయంలో పైప్‌లైన్లు దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఎవరిది? నష్టం జరిగిన వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు ఇన్ని రోజులుగా ఎందుకు స్పందించడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

నీళ్లు అడిగితే వాగ్వాదం.. చేయి చేసుకున్నారంటూ ఆరోపణ!

తాగునీటి సమస్య పరిష్కారంపై పంచాయతీ అధికారులను, ఉపసర్పంచ్‌ను ప్రశ్నించిన గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఉపసర్పంచ్‌తో వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో ఉప సర్పంచ్ తనపై చేయి చేసుకున్నారని సదరు వ్యక్తి ఆరోపించడంతో గ్రామంలో మరో వివాదం చోటుచేసుకుంది. అయితే ఈ ఆరోపణలను ఉపసర్పంచ్ ఖండించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ నీరు అందించడమే తన బాధ్యతని, అందరికీ నీటి సరఫరా జరిగేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. తనను పట్టుకొని ఇష్టానుసారంగా దూషించడంపై ప్రశ్నించానని, ఆ క్రమంలో వాగ్వాదం జరిగిందే తప్ప తాను ఎవరిపైనా చేయి చేసుకోలేదని స్పష్టం చేశారు. దీంతో ఇరువురి వాదనల మధ్య అసలు ఏం జరిగిందన్నది చర్చనీయాంశంగా మారింది.

అధికారుల స్పందన ఏదీ?

ఐదు రోజులుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే దెబ్బతిన్న పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి, అన్ని కాలనీలకు నల్లా నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎయిర్‌టెల్ ఫైబర్ సంస్థ తవ్విన రోడ్లను కూడా యథాస్థితికి తీసుకురావాలని కోరుతున్నారు. నీటి సమస్యపై చోటుచేసుకున్న వివాదంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని అందించడంలో ఇంత నిర్లక్ష్యమా? అభివృద్ధి పనులు ప్రజలకు సౌకర్యాలు కల్పించాలి కానీ, ఉన్న సౌకర్యాలను దూరం చేయకూడదని కట్రాల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపుతారా? అన్నది వేచి చూడాలి.

పెళ్లి సంబంధాలు రావడం లేదని యువకుడి ఆత్మహత్య!

- **వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణం.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



జనగాం జిల్లా/లింగాల గణపురం, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : పెళ్లి సంబంధాలు రావడం లేదని కొంతకాలంగా మనస్తాపంతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన లింగాల గణపురం మండలంలోని కొత్తపెళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గర్వందుల కృష్ణ (మృతుడు) ఆదివారం తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు కృష్ణకు కొంతకాలంగా పెళ్లి సంబంధాలు కుదరక పోవడంతో మనస్తాపానికి గురవుతున్నాడని, ఇదే విషయాన్ని కుటుంబ సభ్యుల వద్ద పలుమార్లు ప్రస్తావిస్తూ బాధపడేవాడని అతడి తండ్రి గర్వందుల సుధాకర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడి, పెళ్లి విషయంలో కుటుంబ సభ్యులు నచ్చజెప్పినా వినకుండా ఆవేదన చెందేవాడని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన కృష్ణ, రెండు మూడు గంటల తర్వాత బావి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఉన్నట్లు అతడి సోదరుడు గర్వందుల యాదగిరి ఫోన్ ద్వారా సమాచారం అందించాడని తండ్రి తెలిపారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని పరిశీలించగా అప్పటికే కృష్ణ మృతి చెందినట్లు గుర్తించారు. తన కుమారుడు పెళ్లి సంబంధాలు కుదరడం లేదనే మనస్తాపంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఈ ఘటనపై తమకు ఎవరిపైనా అనుమానం లేదని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన లింగాల గణపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కిషోర్ తెలిపారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బీజేపీలో యువతకు పెద్దపీట!

ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా మల్లెపాక రాకేష్ నియామకం

- నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం..
- ఇద్దరు యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం



వర్ధన్నపేట, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : వర్ధన్నపేట మండల భారతీయ జనతా పార్టీలో నూతన నియామకంతో రాజకీయ సందడి నెలకొంది. మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన మల్లెపాక రాకేష్‌ను బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా నియమించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు, జిల్లా కార్యదర్శి రాయపురం కుమారస్వామి, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు నాంపెల్లి యాకయ్యలు మల్లెపాక రాకేష్‌కు శాలువా కప్పి సత్కరించారు. యువతకు పార్టీ బాధ్యతలు అప్పగించడం ద్వారా సంస్థాగతంగా పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు ఆకాంక్షించారు.

బీజేపీలోకి యువకుల చేరిక

ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఇద్దరు యువకులు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి నాయకులు సాదరంగా ఆహ్వానించారు. యువత పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాల పట్ల ఆకర్షితులై ముందుకు రావడం శుభపరిణామమని నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది యువతను పార్టీలో భాగస్వాములను చేస్తూ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి సట్ల అనిల్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పెందోట పవన్, మూల రాము, వేల్పుల కార్తీక్, దుర్గయ్య, దూడయ్య, కృష్ణమూర్తి, రాకేష్, భిక్షపతి, తుల్లా శ్రావణ్, నాంపెల్లి శ్రీను, పాన్నాల రవి, మచ్చ రాజు, బొమ్మెర సాయి, తాటికాయల ఎల్లయ్య తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రేమకు కులం అడ్డుకాలేదు.. పోలీసుల సమక్షంలో ఒక్కటైన ప్రేమజంట !

- న్యాయం కోసం ప్రియుడి ఇంటి ముందు యువతి దీక్ష.. చివరకు వివాహ బంధంతో ముగిసిన వివాదం
- ఇరు కుటుంబాలకు ఎస్సై సృజన్ కుమార్ కౌన్సెలింగ్.. యువతికి అండగా నిలిచిన ప్రజా సంఘాలు



పాలకుర్తి, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : కులాంతర వివాహానికి కుటుంబ పెద్దల అభ్యంతరాలు, సామాజిక అడ్డంకులు ఎదురైనా ప్రేమించిన వ్యక్తినే వివాహం చేసుకోవాలన్న యువతి పట్టుదల చివరకు ఫలించింది. ప్రియుడి ఇంటి ముందు న్యాయం కోసం దీక్షకు దిగిన యువతి పోరాటం, పోలీసుల చొరవతో సుఖాంతమైంది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతపురం గ్రామానికి చెందిన గిద్దెల దివ్య, గన్న అరవింద్‌లు పోలీసుల సమక్షంలో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. శాతపురం గ్రామానికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన గిద్దెల దివ్య, అదే గ్రామానికి చెందిన కాపు సామాజిక వర్గానికి చెందిన గన్న అరవింద్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో దివ్య నాలుగు నెలల గర్భవతి కావడంతో ఇద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే వీరి పెళ్లికి అరవింద్ కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం తలెత్తింది.

న్యాయం కోసం ప్రియుడి ఇంటి ముందు దీక్ష!

తనకు అరవిందే భర్తగా కావాలంటూ దివ్య శాతపురంలోని అతడి ఇంటి ఎదుట న్యాయం కోసం పోరాటానికి దిగింది. ఈ విషయం తెలుసుకున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు ఆమెకు మద్దతుగా నిలిచారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు చొరవ తీసుకొని పాలకుర్తి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ఎస్సై చొరవతో వివాదానికి తెర!

ఈ వ్యవహారంపై స్పందించిన పాలకుర్తి ఎస్సై ఊర సృజన్ కుమార్ ఇరు కుటుంబాల సభ్యులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. యువతి పరిస్థితి, ఇరువురి నిర్ణయం, చట్టపరమైన అంశాలను వివరించి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. ఎస్సై చొరవతో అరవింద్ కుటుంబ సభ్యులు తమ అభ్యంతరాలను పక్కనపెట్టి వివాహానికి అంగీకరించినట్లు తెలిసింది. దీంతో పోలీసుల సమక్షంలో, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో దివ్య, అరవింద్‌ల వివాహం జరిగింది. తమ ప్రేమను వివాహ బంధంగా మార్చుకున్న ఈ జంటకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంలో చొరవ చూపిన ఎస్సై సృజన్ కుమార్‌తో పాటు యువతికి అండగా నిలిచిన ప్రజా సంఘాల నాయకులను పలువురు అభినందించారు.

ఓటు హక్కు పరిరక్షణ కోసం ఢిల్లీలో కాంగ్రెస్ భారీ ర్యాలీ!

న్యూఢిల్లీ, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన 'ఓట్ బచావో–దేశ్ బచావో' భారీ ర్యాలీలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డా. పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జాతీయ, రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటు అత్యంత విలువైనదని, ఓటు హక్కును, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో నిర్వహించిన ఈ ర్యాలీ ఓటు హక్కు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే



కార్యక్రమంగా నిలిచిందని డా. పెరుమాండ్ల రామకృష్ణ పేర్కొన్నారు.

నేరాల నియంత్రణే పోలీసుల ప్రధాన కర్తవ్యం!

- పోతుగల్లులో కార్డెన్ అండ్ సెర్చ్.. ప్రజలకు భద్రతపై అవగాహన
- సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.. అనుమానితుల సమాచారం పోలీసులకు అందించాలి: చిట్యాల సీఐ సతీష్



మొగుళ్లపల్లి, నవంబర్ 01 (నిత్యం నిఘా) : నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు భరోసా కల్పించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని చిట్యాల సీఐ సతీష్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పోతుగల్లు గ్రామంలో మొగుళ్లపల్లి ఎస్సై ముప్పు సురేష్ ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్, సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ సతీష్ గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, గంజాయి, నాటుసారా, దొంగతనం సొత్తుతో పాటు అనుమానిత వ్యక్తులను గుర్తించడమే కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. గ్రామంలోకి కొత్తగా వచ్చే వ్యక్తులు, అద్దెకు నివసించే వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం!

రాత్రి వేళల్లో గ్రామంలోకి అనుమానాస్పద వ్యక్తులు వస్తే వెంటనే 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, సైబర్ నేరగాళ్ల మోసాలకు బలికావద్దని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో గొడవలకు దిగడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని భద్రతను మరింత పటిష్టం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని, బాల్యవివాహాలను ప్రోత్సహించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తుల సహకారం ఉంటేనే నేరాలను సమర్థవంతంగా నియంత్రించగలమని ఎస్సై ముప్పు సురేష్ పేర్కొంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల ఎస్సై, మొగుళ్లపల్లి పోలీసు సిబ్బంది, పోతుగల్లు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటు హక్కు పరిరక్షణకు చలో ఢిల్లీ!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతల డిమాండ్
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న హనుమకొండ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు



వర్ధన్నపేట నియోజకవర్గం, నవంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిర్వహించిన 'ఓట్ బచావో–దేశ్ బచావో' కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు, ఓటు హక్కు కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అయూబ్, నిమ్మాని శేఖర్ రావు, రాష్ట్ర నాయకుడు మన్నె బాబురావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీసం సురేందర్ రెడ్డి, హసన్‌పర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్, మాజీ అధ్యక్షుడు పార్రెడ్డి మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు చల్ల రాకేష్ రెడ్డి, చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమార స్వామి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పైపులైన్ ధ్వంసంతో నిలిచిన తాగునీటి సరఫరా



నిత్యం నిఘా, నవంబర్ 01, మంథని : మంథని మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు గౌతమీన గర్ (గంగాపురి)లో రెడీమేడ్ గార్మెంట్స్ కంపెనీ నిర్మాణ పనుల సందర్భంగా తాగునీటి పైపులైన్ ధ్వంసమైంది. దీంతో ఎస్సీ వాడ, గుంటూరు గుడిసెల ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపో యింది. పైపులైన్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం, సోమవారం నీటి సరఫరా ఉండదని పంపు డ్రైవర్ స్వామి స్థాని కులకు తెలిపినట్లు సమాచారం. దీంతో రెండు ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మర మ్మతులు త్వరగా పూర్తి చేసి నీటి సరఫరాను పునరు ద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచితంగా దరఖాస్తు ఫామ్‌లను అందజేసిన ఎస్.వెంకటేష్



నిత్యం నిఘా, నవంబర్ 01, రాజేంద్రనగర్ : కాటేదాన్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్,వెంకట ేశ్వర కాలనీ,నేతాజీ నగర్‌లలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచితంగా దరఖాస్తు ఫామ్‌లను అందజేశారు.ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని కాలనీలలో పర్యటించారు. అర్హులైన గ్రాడ్యుయేట్ యువకులను కలిసి వారికి దరఖాస్తు ఫామ్‌లను స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ..శ్రీరామ్ నగర్,వెంకటేశ్వర కాలనీ,నేతాజీ నగర్ కాలనీలలో గ్రాజివేషన్ చదువు పూర్తి చేసుకున్న ప్రతి గ్రాడ్యుయేట్ యువకుడు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.డివి జన్ పరిధిలోని నిరుద్యోగ యువతకు నిరంతరం అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని తెలిపారు.కాలనీల అభివృద్ధికి,యువత భవిష్యత్తుకు తమ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరూ సమయానికి దరఖాస్తులను పూర్తి చేసి సమర్పించాలని సూచించారు.ఈ పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మైసి రెడ్డి కొంపల్లి జగదీష్,ప్రవీణ్,వెంకటరమణ అనిల్,సంతు గౌడ్,సంతోష్,శివ నందు,మేధావులు రిషి,నరేష్ యోగి,బొడ్రాయి శివ,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

ప్రమాదం జరిగాకే మేల్కొంటారా?
కొత్తపేట - కేశంపేటకు డబుల్ రోడ్డు ఎప్పుడు?



నిత్యం నిఘా, నవంబర్ 01, కేశంపేట : కొత్తపేట నుంచి కేశంపేట మండల కేంద్రానికి చేరుకునే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో నిత్యం ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు కర్రెడ్ల నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుకైన రహదారి, పెరిగిన వాహనాల రద్దీతో ప్రయాణం ప్రమాదక రంగా మారిందని, ఈ మార్గంలో వెళ్లాలంటే వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవా ల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు.ఈ రహదారి కేవలం ప్రయాణ మార్గం మాత్రమే కాదని, మండల ప్రజల నిత్యజీవిత అవసరాలకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే ప్రజలతో పాటు రైతులు ఎరువుల దుకాణాలకు వెళ్లేందుకు ప్రతిరోజూ ఇదే రహదారిని వినియోగిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లేవారు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.గత నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తే, ప్రస్తుత పాలకులు ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలకు మెరుగైన రహదారులు కల్పించడం పాలకుల కనీస బాధ్యత అని గుర్తుచేశారు.ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించి కొత్తపేట–కేశంపేట రహదారిని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించక పోతే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరిం చారు.

భక్తి మార్గంలో నడిస్తే ధర్మమే మనల్ని రక్షిస్తుంది

- **నిస్వార్థంగా కోరుకున్న కోరికలను భగవంతుడు తప్పక తీరుస్తాడు**
- **శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ. ధన్వాడలో మహాపూర్ణాహుతి**
- **మంథనిలో దివ్య ప్రవచనంరెండుమూడేళ్ల నిరీక్షణకు నేడు ఫలితం దక్కింది**
- **మంత్రి శ్రీధర్‌బాబు**



నిత్యం నిఘా, మంథని, నవంబర్ 1 : భగవంతుడు సర్వాంతర్యామి అని, నిస్వార్థంగా, సహేతుకంగా కోరుకున్న కోరికలను తప్పక తీరు స్తాడని అవధూత దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. భక్తి మార్గంలో పయనిస్తూ ధర్మాన్ని ఆచరిస్తే అదే మనల్ని రక్షి స్తుందని, మానవసేవే మాధవసేవగా భావించి అహింసా మార్గంలో నడవాలని సూచించారు.రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానం మేరకు ఆదివారం ధన్వాడ, మంథనిలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో స్వామీజీ పాల్గొని భక్తులకు ప్రవచనమిచ్చారు. తొలుత ధన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయానికి చేరుకున్న ఆయన లోకకల్యాణార్థం నిర్వహించిన మహాపూర్ణాహుతి యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. భగవంతుడు ఎక్కడో లేడని, ప్రతి ఒక్కరి హృదయంలో కొలువై ఉంటాడని పేర్కొన్నారు. భగవంతుడిపై విశ్వాసంతో ధర్మబద్ధంగా జీవించాలని, కష్టసుఖాల్లో ఆ నమ్మకాన్ని కోల్పోకూడదని హితవు పలికారు. ఈ సందర్భంగా భగవంతుడి మహిమను వివరించే తిరుమల క్షేత్రానికి సంబంధించిన ఓ చారిత్రక సంఘటనను భక్తులకు వివరించారు.

స్వామివారి రాకతో మంథనిలో ఆధ్యాత్మిక సందడి...

ధన్వాడలో కార్యక్రమం అనంతరం మంథనికి చేరుకున్న స్వామీజీ శివకి రణ్ గార్డెన్స్‌లో భక్తులకు దర్శనమిచ్చి ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి రాకతో మంథని ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు.

ప్రజలపై స్వామివారి ఆశీస్సులు ఉండాలి... మంత్రి శ్రీధర్‌బాబు

ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. స్వామీజీ మంథని, ధన్వాడ ప్రాంతాల్లో అడుగుపెట్టడం ప్రజల అదృష్టమన్నారు. గత రెండుమూడేళ్లుగా తన తల్లి జయశ్రీ, సతీమణి, కుటుంబ సభ్యులు స్వామివారి రాక కోసం ఎదురుచూస్తున్నారని, నేటితో ఆ నిరీక్షణ ఫలిం చిందని భావోద్వేగంగా పేర్కొన్నారు. ధన్వాడలో దత్తాత్రేయ స్వామి ఆలయంలో మహాపూర్ణాహుతిలో స్వామీజీ పాల్గొనడం విశేషమన్నారు. తెలంగాణతో పాటు పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలు, ముఖ్యంగా మంథని, ధన్వాడ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజల కష్టాలు తొలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. మంథని ప్రజల తరపున స్వామివారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్‌సింగ్ దంపతులు, మంత్రి లక్ష్మణ్‌కుమార్ సతీమణి, జిల్లా కలెక్టర్, రామగుండం పోలీస్ కమిష నర్, ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు పాల్గొన్నారు.

తెలంగాణ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్–2026 ముగింపు వేడుకల్లో విజేతలకు ట్రోఫీలు,ప్రైజ్ మనీ అందజేసిన తోకల శ్రీనివాస్ రెడ్డి.



నిత్యం నిఘా, రాజేంద్రనగర్, నవంబర్ 1 : రాజేంద్రనగర్ నియో జకవర్గం పరిధిలోని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎం ఐఎస్టి),వ్యాసపురి,పల్లెచెరువు మైలార్‌దేవ్‌పల్లి నిర్వ హించిన 12వ స్వర్గీయ సమ్‌రెడ్డి సుదర్శన్ రెడ్డి మెమోరియల్ తెలంగాణ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్–2026 ముగింపు వేడుకల్లో బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్,ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలను అందజేసి అభినందించారు.ముఖ్యంగా మెన్స్ విభాగంలో ప్రథమ స్థానంలో విజయం సాధించిన స్వర్ణ నాయుడుకి ప్రైజ్ మనీ బహు మతిని అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ స్టేట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షురాలు కేకే.మహేశ్వరి,జనరల్ సెక్రటరీ పి.నాగేందర్ రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఏ ఎల్ నరేష్ రెడ్డి ధనంజయ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించ డంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ రాష్ట్ర,జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిం చారు.అదేవిధంగా,మహావీర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో ఇంతటి ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్‌ను విజయవం తంగా నిర్వహించిన రంగారెడ్డి టేబుల్ టెన్నిస్ అసోసి సురేందర్ రెడ్డికి మరోసారి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు.టో ర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విజేతలతో పాటు క్రీడాకా రులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ క్రీడా సంఘం ప్రతినిధులు,నిర్వాహకులు,క్రీడాకా రులు, ప్రముఖులు పాల్గొన్నారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో ముల్లకత్వ ఎస్టీపీ వద్ద గ్రీన్ ట్యాంకర్ సేవలను ప్రారంభించిన సి.ఎం.సి. కమిషనర్



నిత్యం నిఘా, శేరి లింగంపల్లి, నవంబర్ 01 : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు మరియు అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల సమన్వయంతో ముల్లకత్వ మురుగునీటి శుద్ధి కేంద్రం వద్ద గ్రీన్ ట్యాంకర్ సేవలను ప్రారంభించారు.సైబరాబాద్ పరిధి లోని పచ్చదనం, పార్కులు, ల్యాండ్‌స్కేపింగ్ మరియు ఇతర త్రాగునీరు అవసరం లేని పనుల కోసం శుద్ధి చేసిన మురుగునీ టిని సమర్థవంతంగా తిరిగి వినియోగించడాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు, వివిధ సంస్థలు తమ అవసరాలకు అనుగుణంగా శుద్ధి చేసిన ఎస్టీపీ నీటిని పొందేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ *155313* ను సంప్రదించి గ్రీన్ ట్యాంకర్లను బుక్ చేసుకోవచ్చు. ఈ నీటిని గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్ మరియు అనుమతించబ డిన ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తీరుతెన్నుల్లో మార్పులు చోటుచేసుకుని, నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో, విలువైన మంచినీటి వనరులను సంరక్షించాలని, స్థిరమైన నీటి నిర్వహణ విధానాలను అవలంబించాలని సి.ఎం.సి. ప్రజలకు సూచిస్తోంది.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నివాస సంక్షేమ సంఘాలు విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు మరియు ప్రజలు వీలైనంత వరకు తోటల పెంపకం, పచ్చదనం నిర్వహణ, నిర్మాణ పనులు వంటి అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించాలని, తాగునీటిని అనవసరంగా ఉపయోగించ కుండా పాదుపు చేయాలని విజ్ఞప్తి చేశారు.మురుగునీటి పునర్వి నియోగాన్ని ప్రోత్సహించడం, మంచినీటి వనరులపై ఆధారపడ టాన్ని తగ్గించడం మరియు సైబరాబాద్ పరిధిలో పట్టణ పచ్చద నాన్ని స్థిరంగా అభివృద్ధి చేయడం దిశగా గ్రీన్ ట్యాంకర్ కార్యక్రమం ఒక ముఖ్యమైన ముందడుగు అన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com